కలుపు కష్టాలు..!

● ఏపుగా పెరుగుతున్న వరిని పోలిన కలుపు ● గుర్తించలేకపోతున్న రైతులు
● పొట్ట దశలో బయటపడుతున్న వైనం ● లబోదిబోమంటున్న అన్నదాత



పై ఫొటోను చూసి వరిపంట ఏపుగా పెరిగింది, అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అనుకుంటే పొరపాటు పడినట్లే. ఈ మధ్య వరిపంటను పోలిన కలుపు మొక్కలు పంటతో కలిసి పెరుగుతుండడం వలన రైతులు సైతం గుర్తించలేక లబోదిబోమంటున్నారు. ఈ కలుపు వరిపైరులో కలిసిపోయి రైతులు వేసే ఎరువులతో ఏపుగా పెరిగి, అసలైన వరిపైరును ఎదగనీయకుండా చేస్తోంది. తెల్లగా పూతిక వరి మొక్కలా ఉండడంతో పొట్ట దశకు వచ్చేంతవరకు రైతులు కనిపెట్టలేకపోయారు. దీంతో ఇప్పుడు నష్టపోయామని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. సంతబొమ్మాళి మండలంలోని నరిగిపెంట, అంట్లవరం, సంతబొమ్మాళి, దండుగోపాలపురం, కోటపాడు, బృందావనం, వడ్డితాండ్ర తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉండడంతో రైతులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన 1,224 వరి రకం విత్తనాల్లో కల్తీ అవడం వల్లే ఇలాంటి కలుపు మొక్కలు పెరిగాయని వాపోతున్నారు. దీనివలన రైతులు 10 శాతం నుంచి 100 శాతం వరకు నష్టపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎకరాకు సుమారు రూ.25 వేలు వరకు ఖర్చు చేశామని, దిగుబడి వస్తుందనే సమయంలో కలుపు అని తెలియడంతో నిరాశలో కూరుకుపోయారు. – సంతబొమ్మాళి

టెక్కలి నియోజకవర్గంలో వరిసాగు	
మండలం	వరిసాగు (హెక్టార్లలో)
సంతబొమ్మాళి	7,717
కోటబొమ్మాళి	6,956
టెక్కలి	6,997
నందిగాం	8,012

ఆదుకోవాలి



కలుపు వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పొట్ట దశకు వచ్చేంతవరకు కలుపును గుర్తించలేకపోవడంతో నష్టపోయాము. ఎటువంటి మందులు చల్లినా ఈ కలుపు రకం నాశనం కావడం లేదు. ఒరిజనల్ వరి పైరు ఎదగనివ్వకుండా చేసింది.
– కె.మధుసూదనరావు, రైతు, కోటపాడు

నాసిరకంతో ఇబ్బందులు



వరి విత్తనాల్లో నాసిరకం కలవడం వలన ఇలా ఇబ్బందులు రావొద్దు. నగిరిపెంట గ్రామంలో ఐదు ఎకరాల్లో మొదట్లో గుర్తించిన రైతులకు కంపెనీ తరఫున నష్ట పరిహారం కూడా ఇచ్చారు. మిగతా గ్రామాల నుంచి ఎవరు రిపోర్ట్ ఇవ్వలేదు.
– బి.వి.తిరుమలరావు, వ్యవసాయశాఖ ఏడీ, టెక్కలి

నిరీక్షణ



పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు కీలకమైన కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ప్రయాణికులకు నిరీక్షణ తప్పడం లేదు. ఈ నిరీక్షణకు ఇప్పటికే పదిహేనేళ్లు పూర్తయింది. 2009 ఫిబ్రవరి 22న అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.17 కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక వైపు బ్రిడ్జిని పూర్తి చేసేశారు. మరో వైపు పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో తిరిగి పనులు నిలిచిపోయాయి. దీంతో గురువారం నాడు మండుటెండలో నిరీక్షిస్తున్న వాహనదారుల చిత్రమిది. – కాశీబుగ్గ

రక్తదానం



ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ సహకారంతో రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ రబీన్ కుమార్ పాఢి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం

క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఉండాలి

సోంపేట: గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులు రైతులకు రబీ సీజన్‌లో అందుబాటులో ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.జగన్‌మోహనరావు అన్నారు. నాలుగు మండలాల వ్యవసాయ సహాయకులకు సోంపేటలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.కిరణ్‌కుమార్ రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవలసిన చర్యలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కో–ఆర్డినేటర్ రేవతి ప్రకృతి వ్యవసాయం విస్తరణకు సలహాలు, సూచనలు అందజేశారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు చీడి వెంకటరావు వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలు మీద అవగాహన కల్పించారు. ఉద్యానశాఖాధికారి మాధవీలత జీడి, మామిడి పంటల బీమా గురించి తెలియజేశారు. వ్యవసాయాధికారులు బి.నర్సింహమూర్తి, బి.ధనుంజయ, బి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కంచిలి: రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. మండలంలోని ఎస్.ఆర్.సి. పురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.80 లక్షలతో చేపడుతున్న 70 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. మెటీరియల్ వినియోగం, రోడ్డు నిర్మించే పద్ధతులను పరిశీలించి, నిర్మాణదారునికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పాఠశాలలో మొక్కలు నాటుతున్న సంఘ సభ్యులు

కవిటి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని స్థానిక నవయువ చైతన్య సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని జాడుపుడి ఆర్ఎస్ యూపీ పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో సామాజిక వన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మొక్కలు గురువారం నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సంతోష్ పట్నాయిక్, బాసుదేవ రౌతో పాల్గొన్నారు.

ఇంటిపట్టా అందజేత



జానకికి ఇంటి పట్టా అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ బలిజిపల్లి జానకికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి గురువారం ఇంటిపట్టాను అందజేశారు. ఇటీవల ఈదుపురంలో జరిగిన ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటి పట్టా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరిలు పాల్గొన్నారు.

రహదారులపై ప్రత్యేక దృష్టి

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని ఒంకులూరు నుంచి తోటూరు బీచ్ వరకు రూ.7.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగాల సంధ్య, ఎంపీటీసీ కొండాపు సుందరమ్మ, మాజీ ఎంపీటీసీ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్యాన రైతులు జీడి మామిడి పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల ప్రసాద్ సూచించారు. మండలంలోని అక్కుపల్లిలో గురువారం జీడి మామిడి పంట బీమాపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. 2024–25 రబీ సీజన్‌లో పంట బీమాకు సంబంధించి ఈనెల 15వ తేదీలోపు నమోదు ప్రక్రియను సీఎస్‌సీ సెంటర్‌లో పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖాధికారి త్రినాథస్వామి, మండల అధికారి కె.సునీత, ఏవో కిరణ్‌వాణి, సంధ్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు

కాశీబుగ్గ: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మహిళలకు మేలు జరుగుతుందని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందస మండల సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం లీడర్లకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఎఫ్‌పీవో ఆయా ఏరియా ప్రాధాన్యతను బట్టి బిజినెస్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. ఫామ్, నాన్ ఫామ్ ఆదాయం పెంచుకునేటట్లు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో ఇన్‌చార్జి సీసీ కిషోర్, సీసీలు మీనాక్షి, మంగమ్మ బాలకృష్ణ, కల్యాణి పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న లజపతిరాయ్

పలాస: ప్రతి ఒక్కరూ ఇంగ్లిష్‌లో భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ సూచించారు. మండలంలోని రామకృష్ణాపురం శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు రూ.34 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆంగ్లంలో మెలకువలను చెప్పారు. చక్కగా మాట్లాడుకోవడానికి వ్యాకరణం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యా విహార్ డైరెక్టర్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ బి.ప్రీతి చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడికి బీమా సదుపాయం



మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి ప్రసాద్

పలాస: ఉద్దానం ప్రాంతంలోని జీడి మామిడి పంటలకు ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించిందని, సకాలంలో బీమా రుసుము చెల్లిస్తే పంటలకు ప్రకృతిపరమైన ఇబ్బందులు, నష్టాలు వచ్చినప్పుడు పరిహారం అందుతుందని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి ఆర్.వి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని పెద్ద సీలావతి గ్రామంలో ఉద్దానం ప్రాంత రైతులకు బీమా సదుపాయంపై గురువారం అవగాహన కల్పించారు. నవంబర్ 15లోపు బీమా రుసుము చెల్లించాలని సూచించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి ఎకరాకు రూ.1,600లు చెల్లిస్తే ఒక హెక్టారుకు బీమా మొత్తం రూ.80,000 వస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతీ రైతు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ్ స్వామి, పలాస ఉద్యానవన శాఖ అధికారి శంకర్‌దాస్, ఉద్యానవన సహాయకులు తెప్పల పావని, నవీన్ చౌదరి, చింతాడ శ్రీధర్, పలాస వ్యవసాయ అధికారి కె.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సహాయ కమిషనర్ కృష్ణమోహన్

పలాస: పంచాయతీలకు వచ్చిన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సహాయ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల నుంచి వచ్చిన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవడంలో అలసత్వం ఉండకూడదని, ముందుగానే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సామర్లకోట ఈటీసీపీ ప్రసాద్, ఎంపీడీవోలు వసంతకుమార్, రమేష్‌నాయుడు, సూర్యనారాయణ, రాజారావు, డీఎల్‌పీలు ఐ.వి.రమణ, గోపిబాల, టీవోటీ ఆనందరావు, సమీర్‌ఖాన్, సాగర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నడిపితే చర్యలు



పల్లిసారథి సచివాలయాన్ని పరిశీలించిన సీఐ మల్లికార్జునరావు

వజ్రపుకొత్తూరు/రూరల్: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు హెచ్చరించారు. మండలంలోని నువ్వలరేవు, పల్లిసారథి, మంచినీళ్లపేట గ్రామాల్లో గురువారం ఆయన తన బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వేలం పాటలు వేసి బెల్టు షాపులు నడిపితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నాటుసారా అమ్మకాలు చేపట్టినవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ పొందిన మద్యం షాపుల వద్ద మద్యం ధరల పట్టికలను ఏర్పాటు చేశామని, అలాగే సచివాలయాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, నాటుసారాను అమ్మకాలు చేపడితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయనతో పాటు మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ కుమార్, సర్పంచ్‌లు, సిబ్బంది ఉన్నారు.

గ్రోయిన్ల పరిశీలన

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలోని 11 గ్రోయిన్లకు రూ.21 కోట్లతో మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఇచ్ఛాపురం పర్యటనలో భాగంగా బాహుదా నదిపై ఉన్న బెల్లుపడ, ఈదుపురం గ్రోయిన్లను, చానల్స్‌ను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించారు. వారితో పాటు ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● మర్యాదపూర్వక భేటీ





వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ కో–ఆర్డినేటర్, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డితో ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్‌లు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గురువారం శ్రీకాకుళం పర్యటనకు వచ్చిన ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, నాయకులు కెల్లి గోవిందరావు, సంపతిరావు హేమసుందర్‌రాజు పాల్గొన్నారు. – కవిటి/టెక్కలి

పరామర్శ



పంకు రామన్నను పరామర్శిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం రామేశ్వరం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ పంకు ప్రభావతి భర్త పంకు రామన్నను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ గురువారం పరామర్శించారు. రామన్న గుండె సంబంధిత సమస్యతో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తిలక్ ఆస్పత్రికి చేరుకుని రామన్నను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముడిదాన సింహాచలం కుమారుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనతో పాటు కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నాయకులు అన్నెపు రామారావు, కె.గోవింద్, పి.వెంకట్రావు ఉన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

కాశీబుగ్గ: గత నాలుగు నెలలుగా జీతాలు అందక కుటుంబాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని 108 సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె కార్యాలయంలో గురువారం సాయంత్రం కలిసి వినతిపత్రం అందించారు. సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని విన్నవించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది గోపాలకృష్ణ, మురళీమోహన్, శంకరరావు, రామచంద్రారెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కాశీబుగ్గ: మందస మండలంలోని గిరిజన గ్రామాల్లో ఎక్సైజ్ శాఖాధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సీఐ కె.బేబీ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.జాన్‌ప్రసాద్, సిబ్బంది టబాగాం ప్రాంతంలో 960 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు, ఎగుమతి చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూడికతీత పనులు

టెక్కలి: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గొల్లగండి చెరువులో గురువారం పూడికతీత పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి ఆధ్వర్యంలో గుర్రపు డెక్కను తొలగించి స్నానవాటికలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జి.నాగభూషణరావు, పి.వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

పలాస: విజయవాడలో డిసెంబర్ 4న జరగనున్న ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాస కాష్యూ అసోసియేషన్ హాల్‌లో ఆ పార్టీ జిల్లా లీడింగ్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఇచ్ఛాపురం, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, టెక్కలి తదితర మండలాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మావో ఆలోచన విధానం అజేయమైనదని, కమ్యూనిస్టు ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దున్న శ్రీనివాస్, పి.కామేశ్వరరావు, మద్దిల మల్లేశ్వరరావు, అప్పారావు, జగదీష్, నాగేశ్వరరావు, దాలమ్మ పాల్గొన్నారు.

శ్రమదానం

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గురువారం అయ్యప్పస్వాములు శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. గురుస్వామి ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలు శుభ్రం చేశారు.

కిడ్నీ వ్యాధితో ఇద్దరు మృతి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామానికి చెందిన దువ్వు సుప్రియ(33) కిడ్నీ వ్యాధితో మృతి చెందింది. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమె ఆరోగ్యం ఇటీవల కుదుటపడింది. అయితే బుధవారం రాత్రి అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈమె భర్త దువ్వు చంద్రశేఖర్ మాజీ సైనికోద్యోగి కాగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో వారానికి రెండుసార్లు డయాలసిస్ చేసుకుంటున్న తలగాపు ఝాన్సీ(45) అనే మహిళ మృతి చెందింది. ఈమె గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. గురువారం బారువలోని తన కన్నవారి ఇంట్లో ఉండగా ఒక్కసారిగా ఆయాసం వచ్చింది. అయితే సమయానికి ఆక్సిజన్ అందకపోవడంతో ప్రాణాలు విడిచారు. ఈమె స్వగ్రామం కోటబొమ్మాళి. ఈమె భర్త తలగాపు వెంకటరమణ సీనియర్ పాత్రికేయులుగా ఒక పత్రికలో పనిచేస్తున్నారు.

స్తంభాలు వేశారు.. వైర్లు మరిచారు



ఇచ్ఛాపురం రూరల్ మండలం మండపల్లి పంచాయతీలో ఏడాది క్రితం కొత్త విద్యుత్ స్తంభాలను వేశారు. అయితే అనంతరం విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయడాన్ని అధికారులు మరిచిపోయారు. దీంతో గ్రామంలో స్తంభాలు దిష్టి బొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. స్థానిక చర్చి వీధికి సంబంధించి స్తంభాలకు వైర్లు వేయకపోవడంతో రాత్రి సమయాల్లో వీధి లైట్లు లేక చిమ్మచీకటిగా ఉంటోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కోటబొమ్మాళి: విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రశాంతి తదితరులు



టెక్కలి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: మండలంలోని పోలవరం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కి ఎంపికైనట్లు హెచ్‌ఎం విలియమ్స్ తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు భీమవరంలో జరగనున్న అండర్–17 విభాగం రోప్ స్కిప్పింగ్‌కు ఎం.యోగేశ్వరరావు, కడపలో జరగనున్న రగ్బీ క్రీడలకు కె.శిరీష, కె.అభిషేక్, ఎ.వరుణ్ ఎంపికైనట్లు వెల్లడించారు. అలాగే 9వ తేదీ నుంచి 11 వరకు విశాఖపట్నంలో జరగనున్న నెట్‌బాల్ క్రీడలకు సాహు కాజల్, ఎం.చరణ్ తదితరులు ఎంపికయ్యారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.జగదీశ్వరరావుతో పాటు ఇతర ఉపాధ్యాయులంతా విద్యార్థులను అభినందించారు.

కోటబొమ్మాళి: రాష్ట్రస్థాయి పోటీలకు కోటబొమ్మాళి కేజీబీవీకి చెందిన ఆరుగురు బాలికలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి, పీఈటీ రమణమ్మ గురువారం తెలిపారు. కడపలో ఈనెల 8న జరగనున్న రగ్బీ అండర్–14 విభాగం పోటీలకు 9వ తరగతి విద్యార్థిని డి.పూర్ణిమ ఎంపిక కాగా, భీమవరంలో జరగనున్న రోప్ స్కిప్పింగ్ పోటీలకు పి.అశ్విని, పి.రోహిణి, జి.ధనలక్ష్మి, టి.మధులత, టి.డిల్లేశ్వరి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరంతా పోటీల్లో పాల్గొనేందుకు గురువారం బయల్దేరి వెళ్లారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బతకల జశ్వంత్, బతకల హర్షవర్ధన్, పుచ్చ గిరిజ, ఎం.డిల్లేశ్వరిలు అండర్–14, అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి రూఫ్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో పాఠశాలలో హెచ్‌ఎం కె.హరిబాబు, ఇతర సిబ్బంది గురువారం అభినందించారు.

సక్రమంగా బాధ్యతలు నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇచ్ఛాపురం: వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పట్టణంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బందితో పాటు మండల స్థాయిలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులతో మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఆరోగ్యం, శానిటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఆర్డీవో జి.వెంకటేష్ పాల్గొన్నారు.